## క్లుప్తంగా

### మండల సమావేశం 19కి వాయిదా

**పెరవలి:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19కి వాయిదా పడిందని ఎంపీడీఓ పద్మజ తెలిపారు. ఈ సమావేశం సోమవారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వలన వాయిదా వేశామని, దీనిని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు గమనించాలన్నారు. ఈ సమావేశానికి వచ్చే సమయంలో అధికారులు అన్ని వివరాలతో రావాలని ఆమె కోరారు.

### కోటసత్తెమ్మ తల్లికి రూ.1,38,495 ఆదాయం

**నిడదవోలు రూరల్:** నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయాల ద్వారా రూ.1,38,495 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### బాధితులకు నిత్యావసరాల వితరణ



బాధితులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**తాళ్లపూడి:** కొవ్వూరు పట్టణంలోని 4వ వార్డులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో విపర్తి సుబ్బలక్ష్మి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు చేతుల మీదుగా నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, కూరగాయలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మద్దిపట్ల దొరబాబు, పార్టీ నాయకులు జి.సురేష్, మామిడి బంగారయ్య, కొడవటి దేవ, మద్ది శ్రీను తదితరుల పాల్గొన్నారు.

### వృద్ధులను గౌరవించాలి



వృద్ధాశ్రమంలో దుస్తులు అందజేస్తున్న సీనియర్ సిటిజన్ల ఫోరం సభ్యులు

**నిడదవోలు:** సమాజంలో వృద్ధులను అందరూ గౌరవించాలని సీనియర్ సిటిజన్ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని రొట్టెలు, జ్యూస్‌లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల ఫోరం గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, సభ్యులు పొన్నా సుబ్రహ్మణ్యశర్మ, కె.రంగాచార్యులు, పుల్లూరి రామ్మూర్తి, షేక్ సలీం, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, ఎస్.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'జగన్ అంటే నమ్మకం' పుస్తకావిష్కరణ

**దేవరపల్లి:** మండలంలోని యర్నగూడెం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

### సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు సుబ్బారావు మృతి



**దేవరపల్లి:** పొగాకు రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్ తండ్రి యర్నగూడెం సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు సంగాయగూడేనికి చెందిన కరుటూరి సుబ్బారావు(78) ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం స్వగ్రామానికి తీసుకు వస్తుండగా యర్నగూడెం సమీపంలో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. 1990–95 మధ్య కాలంలో యర్నగూడెం సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. ఆయన మృతికి పలువురు నివాళులు అర్పించారు.

# ఇదేం దుర్వినియోగం?



సమిశ్రగూడెంలో యోగా శిక్షణలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు



నిడదవోలు మండలంలో యోగాంధ్ర సర్వే చేస్తున్న సిబ్బంది

- యోగాంధ్ర రిజిస్ట్రేషన్లలో సచివాలయ ఉద్యోగులు
- లక్ష్యాలు విధించి వేధింపులు
- ఓటీపీ అడగడంతో అనుమానిస్తున్న ప్రజలు
- తలలు పట్టుకుంటున్న సిబ్బంది
- డివిజన్‌లో 2,77,872 పేర్లు నమోదు

**నిడదవోలు రూరల్:** కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో అధికారులను ముప్పుతిప్పలు పెడుతోంది. ప్రతి పనికి సర్వేల పేరుతో ఇటు సచివాలయ సిబ్బందిని, అటు ప్రజలను ఇబ్బంది పెడుతోందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పీ4, గృహాలకు ఆధార్ నమోదు ఇలా నిత్యం ఏదో ఒక సర్వే పేరుతో కార్యదర్శులను ఉక్కిబిక్కిరి చేస్తున్నారు. రకరకాల సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పిస్తూ వలంటీర్ల యాప్‌లు కూడా తమకే అంట గట్టడాన్ని సచివాలయ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇవన్నీ చాలదన్నట్లు ఇప్పుడు యోగా యాప్ అంటూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని ఆదేశించడంతో వారు తలలు పట్టుకుంటున్నారు.

**యోగా సర్వే ఇలా..**

ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం యోగాంధ్ర శిబిరాలు నిర్వహిస్తూ శిక్షణ ఇస్తోంది. సచివాలయ ఉద్యోగులు యోగా సర్వే చేసి ప్రజలను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి యోగా యాప్ చూపించి వారు వస్తారో లేదో తెలుసుకుని వివరాలు నమోదు చేయాలి. వెళ్లడానికి సదరు వ్యక్తి ఆసక్తి చూపిస్తే వారి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీని అందులో నమోదు చేసి సబ్మిట్ చేయాలి. అంతవరకు బాగానే ఉంది. వారు రారు అని చెప్పినా యాప్‌లో వివరాలు పొందుపరిచి నో ఆప్షన్ పెట్టినా మొబైల్ నంబర్, ఓటీపీ నమోదు చేయాల్సి వస్తోంది. తాజాగా నో ఆప్షన్ పెట్టిన కుటుంబ సభ్యుల్లో ఒకరిది ఫేషియల్ రికగ్నిషన్ లేదా బయోమెట్రిక్ సబ్మిట్ చేయాలి. ఇలా రాని వారి కోసం ఓటీపీ అడిగి, ఫేస్ ఫొటోలు తీసి, బయోమెట్రిక్ కావాలని అడుగుతుంటే ప్రజలు ఎందుకివ్వాలని ప్రశ్నిస్తూ విసుక్కుంటున్నారు. విసుక్కుంటున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారు. అసలే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేపర్లు, సోషల్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రభుత్వం, పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న తరుణంలో ఓటీపీలు అడగడమేంటని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు.

**డివిజన్‌లో 2,77,872 మంది రిజిస్ట్రేషన్లు**

యోగా చేసేందుకు ఒక్కొక్క సచివాలయ పరిధిలో వేలమందిని రిజిస్ట్రేషన్ చేయాలని కూటమి ప్రభుత్వం టార్గెట్లు పెట్టింది. దీంతో సర్వర్ మొరాయించకపోతే సర్వే పూర్తి చేయడానికి ఒక్కో వ్యక్తి దగ్గర కనీసం 10 నిమిషాలు పడుతోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు ప్రజా సేవలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం సచివాలయాల వద్దకు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు, తల్లికి వందనం అనర్హుల జాబితాకు సంబంధించిన వివరాలతో పాటు ఏదో ఒక పనిపై వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ తరుణంలో సర్వేల పేరుతో సచివాలయ ఉద్యోగులు బయటకు వెళ్తుండటంతో అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నీరుగార్చి అస్తవ్యస్తంగా మారుస్తోందన్న ప్రజలు విమర్శిస్తున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గంలో 2,77,872 మంది యోగా డేలో పాల్గొంటారని ఇప్పటివరకు అధికారులు యాప్‌లో రిజిస్ట్రేషన్లు చేశారు.

**ఒకవైపు శిక్షణ.. మరోవైపు బదిలీలు**

గత పది రోజులుగా యోగాంధ్ర యాప్‌లో పంచాయతీల్లో యోగాసనాలపై మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చినట్లు వివరాలు నమోదు చేశారు. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమాలు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత యోగా తరగతులు నిర్వహించాలని అధికారులు ఇప్పటికే సూచించారు. ఒక వైపు మరో ఐదు రోజుల్లో యోగా దినోత్సవం ఉండగా సచివాలయ బదిలీలకు సంబంధించిన రెండు రోజుల క్రితం జీవో విడుదల చేయడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 30వ తేదీ లోపు బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలతో ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో సచివాలయ పోస్టింగులకు కోసం కూటమి నాయకులను ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఉద్యోగులు వాపోతున్నారు.

## కోకో పూర్తిగా కొనుగోలు చేస్తాం

- ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్
- ఆర్డీవో రాణి సుస్మిత



కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

**తాళ్లపూడి (కొవ్వూరు):** ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో కోకో పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కోకో గింజల కొనుగోళ్లకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. లావాదేవీల్లో సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, సోమవారం నుంచి ఇది అందుబాటులోకి వస్తుందని ఆమె రైతులకు సూచించారు. ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినతులు స్వీకరిస్తామని, వాస్తవ సాగు దారుల నుంచి కోకో దిగుబడులను ఈ నెలాఖరు లోపు పూర్తిగా సేకరించనున్నట్టు ఆమె తెలిపారు. కోకో పంటను జూన్ 30వ తేదీలోగా సేకరించాలని కలెక్టర్ ఆదేశించినట్టు ఆమె తెలిపారు. సందేహాలు ఉంటే 79953 67797 నెంబర్‌లో సంప్రదించాలని ఆర్డీఓ రైతులకు సూచించారు. కనీస మద్దతు ధర రూ.500 ఉండేలా ఈ సెల్ ఏర్పాటు చేశామని, ఇందు కోసం ఒక హార్టికల్చర్ అధికారిని కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు.

## ఘనంగా గంగానమ్మ జాతర

- భక్తులతో కిక్కిరిసిన గ్రామ రహదారులు
- లక్షలాదిగా అమ్మవారి దర్శనం



జాతరకు వచ్చిన భక్తులతో కిక్కిరిసిన ప్రధాన రహదారి

**దేవరపల్లి:** నల్లజర్ల మండలం పోతవరంలో గ్రామ దేవత గంగానమ్మ(ఊడుగులమ్మ) జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గత నెల 29న జాతర మహోత్సవాలు ప్రారంభం కాగా, శనివారం రాత్రి అమ్మవారి జాతర ఉత్సవాలు, పూజలు, బలిచేత నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, బంధువులు, మిత్రులు, గ్రామ ఆడపడుచులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో గ్రామ రహదారులు కిక్కిరిసిపోయాయి. సుమారు రెండు లక్షల మంది భక్తులు నైవేద్యాలకు హాజరైనట్టు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. గ్రామంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఇంటి వద్ద బంధువులు, మిత్రుల సందడి కనిపించింది. సుమారు 39 ఏళ్ల అనంతరం అమ్మవారి జాతర నిర్వహించడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**ఉండ్రాజవరం:** స్థానిక మైత్రేయ బుద్ధ విహార, బౌద్ధధమ్మ పీఠంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి బంతె అనాలియో ఆదివారం తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఉండ్రాజవరం, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఉండ్రాజవరం:** ఇటీవల వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న 49 మందికి సీఎంఆర్ఎఫ్ నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న నిడదవోలు టౌన్, మండలం, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.28.98 లక్షల చెక్కులను ఆదివారం వేలివెన్నులోని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అందజేశారు.

### శ్రీశ్రీకి ఘనంగా నివాళి

**నిడదవోలు:** మహనీయుల ఆశయ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 42వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి మహనీయుల ఆశయ సాధన సభ్యులు జువ్వల రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుందల ప్రభాకరం, జి.జోగినాథరావు, డి.దయామణి, వాసుదేవరావు, పేరూరి సాయిబాబా, పేరిచర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారికి స్వర్ణ పుష్పార్చన



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**దేవరపల్లి:** స్థానికం శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ సందర్భంగా ఆదివారం రాత్రి అర్చకులు స్వర్ణ పుష్పార్చన (అష్టదళ పాద పద్మారాధన) నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జగదీష్



**దేవరపల్లి:** రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని చిన్నాయగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలవుతున్నారని ఆయన అన్నారు. పొగాకు, మిర్చి, కోకో, ధాన్యం పంటలకు కనీస గిట్టుబాటు ధర లేదని ఆయన అన్నారు. పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గత ఏడాది కిలో పొగాకు ధర రూ.410 పలకగా, ఈ ఏడాది రూ.260 ఉందన్నారు. వేలానికి రైతులు తీసుకు వస్తున్న బేళ్లను పూర్తిగా కొనుగోలు చేయడం లేదని ఆయన తెలిపారు. 2024–25 పంట కాలంలో సుమారు 80 మిలియన్ల కిలోల పొగాకు రైతులు పండించగా, ఇప్పటి వరకు కేవలం 18 మిలియన్ల కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పొగాకు నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల ఇబ్బందులను తెలుసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారని ఆయన తెలిపారు. పొగాకు రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కోకో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. కోకో పంటను కొనుగోలు చేసే నాధుడులేక రైతుల ఇళ్ల వద్ద గింజలు నిల్వలు పేరుకుపోయాయని ఆయన తెలిపారు. గత ఏడాది కిలో కోకో గింజలు రూ. 1050 పలకగా, ఈ ఏడాది రూ.400 నుంచి 500 పలుకుతున్నట్టు ఆయన తెలిపారు. రబీ ధాన్యాన్ని ఇంత వరకు పూర్తిగా కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మట్టి మాఫియా పేట్రేగిపోతోంది, చెరువులు, కాలువ గట్లపై మట్టిని అక్రమంగా తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

## 30 ఏళ్లకు ఆ మూడేళ్ల ముచ్చట్లు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాటి డిగ్రీ విద్యార్థులు

సందడి చేసిన 1993–96 బీఎస్సీ బ్యాచ్

**తాళ్లపూడి (కొవ్వూరు):** నిడదవోలు ఎస్వీఆర్‌కే డిగ్రీ కళాశాల 1993–96 బ్యాచ్ విద్యార్థులు 30 ఏళ్లకు కలసి సందడి చేశారు. అప్పటి బీఎస్సీ విద్యార్థులు కొవ్వూరు మండలం విఘ్నేశ్వరంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో, వివిధ ఉన్నతోద్యోగాలు, వృత్తి, వ్యాపారాలలో స్థిరపడిన వారంతా ఈ కార్యక్రమానికి హాజరై నాటి అల్లర్లను, సరదాలను, చిలిపి తగాదాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన జీవీ కృష్ణారావు, డాక్టర్ రేఖపల్లి శ్రీనివాస్, ఎం.అరుణ, డి.కల్పన, బీమా శ్రీనివాస్‌లను వారు సహ విద్యార్థులు అభినందించారు. ఎస్ వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, బి.మనోజ్, జిలాని అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత సేవలు విస్తృతం చేయాలి

- విద్యా కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు
- నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

**గోపాలపురం:** మానవత సేవలు మరింత విస్తృతం చేయాలని కేంద్ర విద్యా నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో ఆదివారం మండల మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ మండలంలోని సంస్థ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.25వేలు ఆర్థిక సహాయం, ప్రతిభా పురస్కారాలను అందజేశారు. గత ఏడాది మండల అధ్యక్షుడిగా పనిచేసిన పి.సత్యకృష్ణారెడ్డిని సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత శాంతి రథం డైరెక్టర్ తానింకి సత్యనారాయణ (బాబి), గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, జొన్నలగడ్డ రాంబాబు, కొయ్య నాగరాజు, గబ్బా లక్ష్మణరావు, నెల్లి చంద్రశేఖర్, పెన్మత్స రంగరాజు, ముప్పన కృపాప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మండల మానవత నూతన కార్యవర్గసభ్యులు అధ్యక్షులు రాపాక ఫణికిషోర్, కార్యదర్శి జుత్తిగ సూర్యచంద్రం, ట్రెజరర్ గెడ జోగేంద్రప్రసాద్, యండపల్లి శేఖర్‌బాబు, ఈసీ కార్యవర్గ సభ్యులచే నూతన ప్రమాణస్వీకారం చేయించారు.

# కాలుష్య కాసారాలు



వ్యర్థాలతో కలుషితమైన చాగల్లులోని మేకల చెరువు



కొవ్వూరు మండలం పశివేదలలో కాలుష్యంతో పచ్చగా మారిన ఊరచెరువు

- మురుగు నీరు, చెత్తతో నిండి అధ్వానంగా చెరువులు
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు

**చాగల్లు:** చెరువులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. మురుగునీరు చేరడం వల్ల పసరు పట్టి చెరువుల్లోని నీరు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. నియోజకవర్గంలో కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో సుమారు వందకు పైగానే చెరువులు ఉన్నాయి. మండలంలో ఆయా పంచాయతీల పరిధిలో సుమారు 40 వరకు చెరువులు ఉన్నాయి. వీటిలో అధిక భాగం గ్రామాల మధ్యలోనే ఉన్నాయి. డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగునీరు, స్థానికులు వేసే చెత్తాచెదారాలతో చెరువులోని నీరు మురుగు వాసన వస్తున్నాయి. కొన్నిచోట్ల చెరువుగట్లను బహిర్భూమిగా ఉపయోగిస్తున్నందున పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోంది. గతంలో మంచి నీటి చెరువులు, రజకుల చెరువుగా ప్రజలకు ఉపయోగపడేవి. ప్రస్తుతం కాలుష్యం వల్ల పశువుల దాహార్తిని తీర్చడానికి కూడా అనువుగా లేకుండా ఉన్నాయి. మండల కేంద్రమైన చాగల్లులో జనవాసాల మధ్య ఉన్న తోళం చెరువు, మాతంగి చెరువు, ఊనగట్లలో ఊర చెరువు, బ్రాహ్మణగూడెంలో ప్రత్తిపాటి చెరువు, కలవలపల్లిలో, నందిగంపాడులో నీరు మురిగిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎస్.ముప్పవరం, మల్లవరం ఎస్సీకాలనీలో ఉన్న చెరువుల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో పాటు నీరు కలుషితం కావడంతో వీటి వల్ల వచ్చే చేడు వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం**

గ్రామంలోని చెరువులు పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులు. ఒక్కొక్క చెరువు మూడేళ్ల వేలం పాటకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. వేలంలో దక్కించుకున్నవారు చెరువుల్లో చేపలను పెంచి మంచి ఆదాయం పొందుతున్నారు. అయితే చేపల మేతకు ఉపయోగించే వ్యర్థ పదార్థాల వల్ల చెరువులు కాలుష్య కోరల్లోకి వెళ్తున్నాయి. వేసవికాలంలో ఈ కాలుష్యం వల్ల చేపలకు ఆక్సిజన్ అందక చనిపోవడం సర్వసాధారణం, వీటివల్ల మరింత దుర్గంధం వ్యాపిస్తూ చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెరువుల కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కొన్ని సందర్భాల్లో అనారోగ్యాలకు గురవుతున్నామని పరిసర ప్రాంతాలవారు చెబుతున్నారు. చెరువుల కాలుష్యం నివారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీటిని క్లోరినేషన్, పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా దుర్వాసన రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నందున బహిరంగ మలవిసర్జన జరగకుండా చూడాలన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చెరువుగట్లను ఆధునీకరించి మొక్కలు పెంచితే పంచాయతీకి ఆదాయంతో పాటు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కాలుష్య నివారణకు చర్యలు**

గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, అపరిశుభ్రతను తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. చెరువుల్లో కాలుష్య నివారణకు చర్యలు చేపడతాను.

– ఆర్.శ్రావణ్‌కుమార్, ఈవోపీఆర్డీ, చాగల్లు

### విద్యుత్ సరాఫరాకు నేడు అంతరాయం

**ఉండ్రాజవరం:** విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మండలంలో పాలంగి గ్రామానికి, చివటం అగ్రికల్చర్ రైతులకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం తెలిపారు.